అదును దాటకముందే.. సమాయత్తం

- ముమ్మరంగా యాసంగి వరి సాగు పనులు
- సూచనలు, సలహాలు అందిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



హస్నాబాద్ చెరువు తూము వద్ద నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న రైతులు



ఆలేడ్ శివారులోని నారుమడి

దుద్యాల్: ఆరుగాలం శ్రమించి పచ్చని సిరులు పండిస్తున్న పుడమి పుత్రులు యాసంగి వరి సాగుకు సిద్ధమయ్యారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడేందుకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం వరి సాగుకు రైతులు సిద్ధం కావాలని సూచనలు చేస్తున్నారు. దీనిపై ఊరూరా అవగాహన సదస్సులు చేస్తున్నారు. సకాలంలో సాగు చేపడితే చివరి దశలో తుపానుల బారిన పడకుండా పంట కాపాడుకోవచ్చని వివరిస్తున్నారు. మండల పరిధిలోని హస్నాబాద్, ఆలేడ్ గ్రామాలకు చెందిన రైతులు చెరువు కింద వేయి ఎకరాల్లో సాగుకు సమాయత్తం అవుతున్నారు. ఇవే కాకుండా దుద్యాల్, లగచర్ల గ్రామాల్లో ఉన్న చెరువుల కింద ఐదు వందల ఎకరాలకు పైగా సాగుకు ఆయా గ్రామాల చెరువుల నుంచి ప్రభుత్వం నీటిని వదులుతుంది. ఒక్క చెరువు కింద సాగు మాత్రమే కాకుండా బోర్ల ద్వారా కూడా సాగు చేయడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రస్తుతం నారు పోసుకుంటున్నారు. మరో 15–20 రోజుల్లో వరి నాట్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రతి మంగళవారం కొడంగల్ మండల పరిధిలోని పర్సాపూర్ రైతు వేదికలో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అందిస్తున్నారు.

ఆలస్యం అనర్థమే

నాట్లు ఆలస్యమైతే పంట లేటుగా వచ్చి తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని, తద్వారా వరి సాగుకు ఖర్చు అధికమవుతుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. వేసవి కావడంతో బోర్లు, చెరువులలో నీరు తగ్గే అవకాశం ఉంటుంది. దాంతో పంటలకు పూర్తి స్థాయిలో నీరందక దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకని డిసెంబర్ నెలలో నారుమడులు సిద్ధం చేసుకుని నారు పోసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సంక్రాంతి పండగకు ముందుగానీ తర్వాత గానీ నాట్లు పూర్తవుతే పంటకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉండవని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు.

సూచనలు పాటించాలి

రైతన్నలు యాసంగి వరి సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో సాగు విధానంపై వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవడం చాలా మంచిది. యాసంగి వరి సాగుకు ఏ రకం విత్తనాలు వేసుకోవాలి. ఏ రకం విత్తనాలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందనే విషయాలను తెలిపేందుకు సిద్ధంగా ఉన్నాం. వరి, ఇతర పంటలే కాకుండా కూరగాయల సాగుపై కూడా పూర్తి స్థాయి సలహాలు తీసుకోవాలి. అందుకు ప్రతి గ్రామంలో ఏఈఓలు అందుబాటులో ఉన్నారు.

– తులసి, ఏఓ, దుద్యాల్

రేపటి నుంచి మల్లికార్జునస్వామి జాతర

మోమిన్‌పేట: మండల పరిధిలోని చక్రంపల్లి గ్రామంలో శనివారం నుంచి భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ నారాయణగౌడ్ తెలిపారు. 21వ తేదీన స్వామి వారిసేవ, 22న పుణ్యావాచనం, కల్యాణం, అగ్నిగుండ ప్రవేశం, 23న పాలుపట్టుట, బండ్ల ఊరేగింపు, బోనాలు, 24న మల్లన్న నాగవెల్లి, ఎల్లమ్మ బోనాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలన్నారు.

భవన నిర్మాణానికి మట్టి నమూనా సేకరణ

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.65 కోట్లతో నూతనంగా నిర్మించే భవనానికి గురువారం మట్టి నమూనాలు సేకరించారు. నిర్మాణం సమయంలో పునాది గట్టిదనంగా ఉండాలనే ఉద్దేశంతో 5 నుంచి 10 మీటర్ల వరకు లోతుగా గుంత తీసి మట్టిని తీశారు. ల్యాబ్‌కు పంపించి పరిశీలించనున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సింలు, నాయకులు బీములు, నరేశ్, మైముద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

21నుంచి ఆంజనేయస్వామి జాతర



ఉత్సవ మూర్తులు

దుద్యాల్: మండల పరిధిలోని చిలుముల మైల్వార్ గ్రామ అడవుల్లో మామిడికుంట ఆంజనేయ స్వామి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏడాదికి రెండుసార్లు జరిగే ఈ జాతర మొదట శ్రావణమాసంలో జరగగా రెండోసారి భారతాల పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహిస్తారు. ఈ వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త పురుషోత్తం దేశ్‌పాండే తెలిపారు. ఈ ఉత్సవాలు శనివారం ప్రారంభమై సోమవారం రోజు ముగుస్తాయని చెప్పారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి



జిల్లా కేంద్రానికి తరలి వెళుతున్న సమగ్ర ఉద్యోగులు

యాలాల: విద్యాశాఖలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను వెంటనే క్రమబద్ధీకరించాలని మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో చేస్తున్న సమ్మెకు మద్దతుగా గురువారం తరలివెళ్లారు. మండల ఎమ్మార్సీ కార్యాలయంలో విధులు నిర్వహించే మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ సర్వర్, సీఆర్పీలు శ్రీనివాస్, ఇస్మాయిల్, మొగులప్ప, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేష్, కేజీబీవీ ఎస్‌ఓ, సీఆర్‌టీలు వెళ్లారు. సమగ్ర ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు పే స్కేలు వెంటనే అమలు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిమితికి మించి తరలించొద్దు



డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ శంకర్

బషీరాబాద్: ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే వారిపై ఆర్టీఏ చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ శంకర్ హెచ్చరించారు. గురువారం బషీరాబాద్(నావంద్గి) రైల్వే స్టేషన్ దగ్గర అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆటోలు, జీపు డ్రైవర్లు అతివేగంతో నడుపుతున్నారని, అలా చేయడం ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడినట్లేనని అన్నారు. తరచూ రోడ్డు ప్రమాదాల్లో ఆటోలు, జీపులు, బైకుల ద్వారానే జరుగుతున్నాయని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని సూచించారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం



నియామకపత్రం అందజేస్తున్న సీనియర్ నాయకుడు పాండుగౌడ్

ధారూరు: మండల కేంద్రంలోని 212, 213, 214 పోలింగ్ బూత్‌లకు గురువారం బీజేపీ పార్టీ నుంచి కమిటీలను నియమించినట్లు పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పాండుగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.రమేశ్‌లు తెలిపారు. మూడు బూత్‌లకు అధ్యక్షులుగా దుబ్బ మల్లేశం, జి.సంతోష్, రాఘవేందర్‌గౌడ్‌లను నియమించినట్లు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేందర్‌గౌడ్, విశ్వనాథం, రవీందర్‌గౌడ్, శివ, కృష్ణ, జగన్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

శబరిమలకు వెళ్లిన అయ్యప్ప స్వాములు

కుల్కచర్ల: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో 41 రోజుల పాటుగా మాలధారణ చేసిన స్వాములు గురువారం శబరిమలకు బయలుదేరారు. ఈ కార్యక్రమానికి డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, నాయకులు కుమ్మరి స్వామి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు 'హరేరామ' అల్పాహారం



బొంరాస్‌పేట: విద్యార్థులకు అల్పాహారం ఇస్తున్న ఫౌండేషన్ సభ్యులు



దుద్యాల్: ఈర్లపల్లిలో అల్పాహారం ప్రారంభిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని రేగడిమైలారం పాఠశాల విద్యార్థులకు గురువారం ఉదయం అల్పాహారం ఇచ్చారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దాసరి చంద్రప్ప మాట్లాడుతూ 'ఆహారం పరబ్రహ్మ స్వరూపం'అంటూ భగవంతుని పేరున పేద విద్యార్థులకు అల్పాహారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేశం, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, పార్టీ గ్రామాధ్యక్షుడు కుమ్మరి గుండప్ప, నాయకులు కుమ్మరి వెంకటయ్య, కుర్వ శేఖర్, రఘుపతిరాజు తదితరులున్నారు.

విద్యార్థుల ఆకలి తీర్చడానికి

దుద్యాల్: మండల పరిధిలోని ఈర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో అల్పాహార కార్యక్రమాన్ని మండల ఎస్టీ అధ్యక్షుడు రవి నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం వేళల్లో విద్యార్థుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా అల్పాహార కార్యక్రమాన్ని ప్రభుత్వం హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్‌తో కలిసి ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవులు, యశ్వంత్, సుబాష్, కాంగ్రెస్ నాయకులు మొగులయ్య, రాహుల్ నాయక్, పెంటయ్య, రామయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి తుల్జా భవానీమాత జాతర

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామంలో కొలువైన శ్రీ తుల్జాభవానీ మాత జాతర మహోత్సవాన్ని ఈనెల 22 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు నరోత్తమ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు అమ్మవారి సన్నిధిలో పతకావిష్కరణతో ప్రారంభమై శ్రీరాముల వారికి అభిషేకం, అలంకరణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం మల్లన్న స్వామికి, కాటమయ్యకు బోనాలతో ఊరేగింపు చేస్తారని ఆయన వివరించారు.

ఘనంగా పల్లకీ సేవ

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో గురుగోవిందనంద స్వామి జయంతిని పురస్కరించుకుని గురువారం పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వీరభద్రేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకీ సేవను ఊరేగించారు.

మేకల సంతకు స్థల పరిశీలన

బంట్వారం: తొర్మామిడి శివారులో రూ.1.50 కోట్లతో రైతు గోదాం నిర్మాణం చేపడుతామని మర్పల్లి మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన బంట్వారం మండల కేంద్రంలో మేకల సంత ఏర్పాటుకు సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. బస్టాండ్ వెనుకాల 30 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తూ కలెక్టర్ ఇప్పటికే ఆర్డర్ కాపీ ఇచ్చారన్నారు. సీసీఎల్‌ఏలో ప్రక్రియ పూర్తికాగానే మేకల సంతను ప్రారంభిస్తామన్నారు. అనంతరం రైతు గోదాం నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ స్థలాన్ని సందర్శించి రెవెన్యూ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు యాదగిరి, శాకం నర్సింలు మార్కెట్ సిబ్బంది పెంటయ్య పాల్గొన్నారు.

విదేశీ కలుపుతో పెనుముప్పు

ఈకోఫాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాయి సంపత్



రెడ్డిఘణాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సాయి సంపత్

బషీరాబాద్: జీవ వైవిధ్యానికి విదేశీ ఆక్రమిత కలుపు మొక్కలు పెను ముప్పుగా వాటిల్లుతున్నాయని ఈకోఫాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మెట్టు సాయి సంపత్ ఆందోళన వ్యక్తం చేశారు. దీని నిర్మూలన కోసం సంస్థ ఆధ్వర్యంతో రైతులను, ప్రజలను చైతన్యం చేయడానికి గురువారం మండలంలోని బాద్లాపూర్, కాశీంపూర్, రెడ్డిఘణాపూర్ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి సంపత్ మాట్లాడుతూ.. విదేశీ ఆక్రమిత కలుపు మొక్కలు వ్యవసాయ సంక్షోభానికి దారితీస్తుందని అన్నారు. పంట పొలాల్లో మొలిసే వయ్యారి భామ, సీసకమ్మరి, ఇగడ, బూడిదఅళం, ముళ్లపూల అళం వంటి కలుపు మొక్కల దుష్ప్రభావంపై రైతులను చైతన్య పర్చడం సామాజికబాధ్యతగా తీసుకున్నామన్నారు. వీటి నివారణకు ఉపాధి హామీ పథకం కింద చేర్చి కూలీల చేత తీయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఈకోఫాన్ సొసైటీ ప్రతినిధులు ప్రభాకర్, రాజశేఖర్, మహ్మద్ షా, ఫైసల్, నవీన్, శివకుమార్, శ్రీనివాస్, సురేష్, మహేష్, పాండు, రైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

టీజీయూఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



మండల నూతన కార్యవర్గంతో జిల్లా నాయకులు

దౌల్తాబాద్: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్ ఆధ్వర్యంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కాట్రవత్ రమేష్‌నాయక్, ప్రధానకార్యదర్శిగా రవినాయక్, గౌరవ అధ్యక్షుడిగా అంబ్ర్యానాయక్, మహిళా అధ్యక్షురాలిగా సుజాత, కార్యదర్శిగా పరుశురాంలతో పాటు కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు దామోదర్‌నాయక్ ఉన్నారు.

28న వ్యర్థాల సేకరణకు బహిరంగ వేలం

తాండూరు టౌన్ : తాండూరు మున్సిపల్ పరిధిలో వ్యర్థాల సేకరణ, రవాణా నిర్వహించేందుకు ఈనెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25వ ఆర్థిక సంవత్సరానికి గాను పట్టణ మున్సిపల్ పరిధిలో డైలీ బేసిస్‌పై చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాల సేకరణ, రవాణా, సైంటిఫిక్ డిస్పోజబుల్ ఏజెన్సీల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. వ్యర్థాల సేకరణ, రవాణాలో కనీసం మూడేళ్ల అనుభవం గల ఏజెన్సీలు ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు మున్సిపల్ కార్యాలయంలో రూ.5,000ల డీడీతో పాటు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

రోడ్డంతా దుమ్ము.. వెళ్లాలంటే దమ్ము!



దుమ్ము, ధూళితో నిండిపోయిన నాందార్‌పూర్ రోడ్డు

బొంరాస్‌పేట: రోడ్డు విస్తరణ పనులు వాహదారులకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న తుంకమెట్ల నుంచి కోస్గి వైపు నాందార్‌పూర్ మీదుగా రెండు లైన్ల రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. అయితే వాహనాలు వెళ్లేటప్పుడు వెలువడిన దుమ్ము ధూళి కారణంగా వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పనులు చేసేటప్పుడు కాంట్రాక్టరు నీళ్లు చల్లించాలని అటువైపు వెళ్లే ప్రయాణికులు కోరుతున్నారు.

సహాయం అందేలా కృషి చేస్తాం



రైతుతో మాట్లాడుతున్న ఆర్‌ఐ సుదర్శన్

దోమ: నిప్పంటుకొని దగ్ధమైన కంది పంటను గురువారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. దోమ మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామానికి చెందిన బండి నర్సయ్య అనే రైతుకున్న రెండెకరాల పొలంలో కంది పంటను సాగు చేసిన విషయం తెలిసిందే. కాగా ఆ పంట బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలి బుడిదైంది. విషయం తెలుసుకున్న అధికారులు బాధిత రైతు పొలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గత కారణాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆర్‌ఐ సుదర్శన్ తెలిపారు. కంది పంటకు సహాయం అందేలా కృషి చేస్తామన్నారు.

బాధ్యతల స్వీకరణ

బంట్వారం: దౌల్తాబాద్ నుంచి బదిలీపై వచ్చిన శ్రీశైలంయాదవ్ బంట్వారం ఎస్‌ఐగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ శ్రీశైలం నారాయణ్‌ఖేడ్‌కు బదిలీపై వెళ్లారు. ఈ క్రమంలో పోలీసు ఉన్నతాధికారులు దౌల్తాబాద్ ఎస్‌ఐను బంట్వారంకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు, పోలీసులకు సహకరించాలన్నారు. నేరాలను నియంత్రిస్తూనే, శాంతిభద్రతలను కాపాడుతామన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలు అభ్యంతరకరం

బొంరాస్‌పేట: అసెంబ్లీ సమావేశాల్లో డ్రంకన్ డ్రైవ్ కేసులు పెట్టాలని బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు అనడం సిగ్గు చేటని యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగిశెట్టి విజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సభాపతిగా దళితబిడ్డ గడ్డం ప్రసాద్ కూర్చోవడం జీర్ణించుకోలేక కేసీఆర్ సమావేశాలకు రాలేకపోతున్నారని ఆరోపించారు. ఇలాంటి హాస్యాస్పద వ్యాఖ్యలు సభలో ఇకపై చేయడం మంచిది కాదన్నారు.

పెళ్లికి సరుకుల అందజేత

కుల్కచర్ల: ఆడపడచుల కుటుంబాలకు అండగా ఉంటామని పటేల్ చెరువు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ శాంతిబాయితులసీరాం అన్నారు. గురువారం కుల్కచర్ల మండలం పటేల్ చెరువు గ్రామపంచాయతీ కిచ్చెన్నకుంట తండాకు చెందిన నేనావత్ రుక్కిబాయి హన్మంతునాయక్ కుమార్తె పూజ వివాహాన్ని పురస్కరించుకుని క్వింటాలు బియ్యం, 15 కేజీల నూనె డబ్బా, పప్పు తదితర వంట సామగ్రిని మాజీ సర్పంచ్ అందించారు. కార్యక్రమంలో శివరాం, రమేష్, బలరాం నాయక్, పెంట్యానాయక్, రవి, రవీందర్, శంకర్, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కుల్కచర్ల: పుర్సంపల్లి గ్రామంలో సర్వే చేస్తున్న సిబ్బందితో నాయకులు

తాండూరు: తాండూరు మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు కోసం సర్వే కొనసాగుతోంది. గురువారం మున్సిపల్ పరిధిలోని 36 వార్డుల నుంచి ప్రజా పాలనలో వచ్చిన 12వేల దరఖాస్తుల పరిశీలన చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు సర్వే చేసి తుది జాబితాను సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అర్హులను గుర్తించాలి

దోమ: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పంచాయతీ కార్యదర్శులు అర్హులను గుర్తించాలని ఎంపీడీఓ మహేశ్ బాబు సూచించారు. గురువారం మండల పరిధిలోని రాకొండ, మోత్కూర్ గ్రామాలలో ఆయన పర్యటించి పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ యాదయ్య, పీఆర్ ఏఈ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..


మోమిన్‌పేట: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతుందని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మేకవనంపల్లి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆమె పరిశీలించారు. ప్రత్యేక యాప్‌లో చేస్తున్న సర్వేలో దరఖాస్తుదారులు చెప్పే విషయాన్ని బట్టి మార్కులు వేస్తారని ఎంపీడీఓ అన్నారు. మార్కుల ఆధారంగానే అర్హులను గుర్తిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సుగుణ తదితరులు ఉన్నారు.

చౌడాపూర్‌లో..


కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా చౌడాపూర్ మండల పరిధిలోని పుర్సంపల్లి గ్రామపంచాయతీలో కార్యదర్శి రామకృష్ణ ఇంటింటి సర్వే నిర్వహించారు. అదేవిధంగా కుల్కచర్ల మండలం రాంరెడ్డిపల్లి గ్రామ ప్రత్యేకాధికారి వీరస్వామి ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి నర్సింలు యాదవ్, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మదన్‌పల్లిలో..


బొంరాస్‌పేట: ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ పథకంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని ఎంపీడీఓ వెంకన్‌గౌడ్ అన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను మండల పరిధిలోని మదన్‌పల్లి, మదన్‌పల్లితండా తదితర గ్రామాల్లో ఎంపీడీఓ, ఎంపీఓ మహేశ్‌కుమార్ తదితరులు ఇంటింటి సర్వేను పరిశీలించారు.



తాండూరు: మున్సిపల్ పరిధిలో సర్వే చేస్తున్న సిబ్బంది



దోమ: మోత్కూర్‌లో ఎంపీడీఓ మహేశ్‌బాబు పరిశీలన



మోమిన్‌పేట: మేకవనంపల్లిలో